క్లుప్తంగా

ఎంపీఓకు సన్మానం


ఎంపీఓకు పూలబొకే అందజేస్తున్న నాయకులు

ఖానాపురం : మండల పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సునీల్‌ను గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీఓ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉస్మాన్ పాషా, వీరన్న, భిక్షపతి, విజయ్, రమేష్, వెంకటమ్మ, సోమక్క, యాకూబీ, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీఓ లెక్కల అరుంధతి బుధవారం తనిఖీ చేశారు. అన్నం, కూరలను పరిశీలించి, స్వయంగా రుచి చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఆమె వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

సేవ చేయడమే లక్ష్యం


శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న కస్తూర్బాగాంధీ విద్యార్థులు, నాయకులు

రాయపర్తి : గ్రామాల్లో పార్టీలకు సంబంధం లేకుండా సొంత ఖర్చులతో ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మైలారంలో ముదిరాజ్‌ల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి సుమారు రూ.10లక్షల విలువ చేసే సొంత ఖర్చులతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. తిర్మలాయపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి బోరుమోటార్‌ను అందిజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కస్తూర్బాను సందర్శించి, ఆర్వో వాటర్ ప్లాంట్ రిపేరింగ్, ఫర్నిచర్, టైల్స్ వేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఎన్నిక


వాసుదేవరెడ్డి

వర్ధన్నపేట : మోటర్ మెకానిక్ మండల అధ్యక్షుడిగా రాజిడి వాసుదేవరెడ్డిని ఎన్నుకున్నారు. బుధవారం స్థానికంగా సమావేశమైన మోటర్ మెకానిక్‌లు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రాము, కోశాధికారిగా కోమల గిరి, సభ్యులు రాకేష్, సంపత్, అనిల్, ఎల్లగౌడ్, తిరుపతి, భిక్షపతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాలకు తరలిన గ్రామస్తులు



రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామస్తులు బుధవారం వనభోజనాలకు తరలి వెళ్లారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పాడి పంటలు పండేలా చూడాలని, గ్రామస్తులు ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై అయోమయం

● 1,500 మంది రైతులకు ఇబ్బందులు


రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ

పర్వతగిరి : రుణమాఫీపై రైతులు అయోమయానికి గురవుతున్నారు. మొదటి విడత రూ.లక్ష లోపు రుణమాఫీపై మండలంలో 15,000 మంది అర్హత పొందారు. అందులో 1,500 మంది రైతులు బ్యాంకులు, ఏఓ కార్యాలయం, ప్రజావాణి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. చౌటపల్లి పీఏసీఎస్ పరిధిలో 400 మంది, పర్వతగిరి పీఏసీఎస్ నుంచి 400 మంది, ఏటీబీ నుంచి 100 మంది, మరో 600 మంది నుంచి ఏఓకు ఫిర్యాదులు అందాయి. రుణమాఫీకి సంబంధించిన అనేక సందేహాలకు సమాధానం చెప్పలేక ఏఈఓలు, ఏఓ తలలు పట్టుకుంటున్నారు. పంట రుణాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం బ్యాంకర్లను కోరింది. అయితే బ్యాంకర్లు ఆ జాబితాను అందజేసినా ప్రభుత్వం కొర్రీల పేరుతో ఇబ్బందిపెడుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతుల ఆధార్ నంబర్లు సరిగా లేకపోవడం, పాస్‌బుక్‌లో తప్పులు దొర్లడం, ఫోన్ నంబర్లు ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అర్హులైన వారికి రుణమాఫీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసిన..



కొంకపాక గ్రామంలో వ్యవసాయ భూమి ఉంది. 2023 సెప్టెంబర్ 12న ఇండియన్ బ్యాంకు పంథిని బ్రాంచ్ నుంచి రూ.60వేల పంట రుణాన్ని పొందాను. తెల్లరేషన్ కార్డుపై నేను ఒక్క దాన్నే రుణం పొందాను. రుణమాఫీ నాకు వర్తించలేదు. ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేశా.

– మూడు భద్రమ్మ, మూడెత్తులతండా

అనర్హులు ఉన్నారు



మండలంలో 15,000 మంది లక్ష లోపు రుణమాఫీకి అర్హులు కాగా అందులో పది శాతం అంటే 1,500 మందికి రుణమాఫీ వర్తించలేదు. వారిలో 100 మంది వరకు అనర్హులుగా గుర్తించాం. మిగిలిన 1,400 మంది జాబితాను ప్రభుత్వానికి పంపిస్తున్నాం.

– ప్రశాంత్‌కుమార్,ఏఓ

పాపన్న జయంతికి సెలవు ప్రకటించాలి


చెక్కు అందజేస్తున్న రమేష్‌గౌడ్, తదితరులు

చెన్నారావుపేట : గోల్కొండ కోటను ఏలిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహరాజ్ జయంతి రోజును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ కోరారు. మండలంలోని బోజేర్వు గ్రామానికి చెందిన దీగొండ నాగేశ్వర్‌రావు గౌడ్ ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. కాగా నాగేశ్వర్‌రావు భార్య శోభకు బీసీ కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.25 వేల చెక్కును బుధవారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి రోజు జనగామ జిల్లాకు పాపన్నగౌడ్ జిల్లాగా ప్రకటించాలన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఖిలా షాపూర్‌లోని పాపన్న కోటను సంరక్షించాలన్నారు. రాష్ట్రంలోని గీత కార్మికులకు ఉచితంగా కాటమయ్య రక్షణ కవచాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ భాస్కర్, మోకుదెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గొడిశాల సదానందంగౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్, మచ్చిక రాజుగౌడ్, చెన్నారావుపేట, నర్సంపేట మండలాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

మడేలయ్యకు ప్రత్యేక పూజలు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో రజకులు బుధవారం తమ ఇష్టదైవమైన మడేలయ్య బోనాల పండుగను నిర్వహించారు. ఈ మేరకు ఊర చెరువు వద్దగల మడేలయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో వచ్చి మొక్కులు చెల్లించారు. గట్టికొప్పుల రాజు, సునీల్, రాజ్‌కుమార్, శ్యాం, శ్రీకాంత్, కొత్తపల్లి ప్రభాకర్, సంతోష్, గొల్లపల్లి నవీన్, కొత్తపెల్లి అజయ్, విజయ్, రాయరాకుల కన్నయ్యతో పాటు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు


సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో పారిశుద్ధ్యంపై అధికారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్ సత్యశారదాదేవి

పర్వతగిరి: మండలంలో కలెక్టర్ సత్యశారదాదేవి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. చింతనెక్కొండ ఊర చెరువుకట్ట మరమ్మతు పనులు పరిశీలించి అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్, కళాశాలను సందర్శించారు. పారిశుద్ధ్యం లోపించడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో అలసత్వం వహిస్తున్న సోషల్ వెల్ఫేర్ స్కూల్ సిబ్బంది, మండల అభివృద్ధి అధికారిపై మండిపడ్డారు. తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని చెప్పారు. వేడినీళ్ల కోసం గీజర్లను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కలెక్టర్‌ను కోరారు. గీజర్ ఏర్పాట్లకు ప్రతిపాదనలు పంపించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించారు. సాంకేతిక సమస్యతో సోలార్ పనిచేయడం లేదని బదులు ఇవ్వగా.. ఎన్ని రోజులుగా పనిచేయడం లేదని ఆరా తీశారు. నెల రోజుల నుంచి సమస్య ఉందని వివరించగా అంత సమయం ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. తక్షణమే సోలార్ పనులను పూర్తి చేసి విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని ఎంపీడీఓ శంకర్‌ను ఆదేశించారు. విద్యుత్ ఉండడంతో సోలార్‌పై నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చి పాములు తీసుకెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

రుణమాఫీ ఫిర్యాదులపై ఆరా..

అనంతరం ఏఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ రైతు రుణమాఫీపై వచ్చిన ఫిర్యాదులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 1,500 ఫిర్యాదులు వచ్చాయని, వివిధ కారణాలతో సుమారు 100 వరకు అనర్హులుగా ఉన్నారని, మిగిలిన 1,400 మంది అర్హులుగా ఉన్నారని ఏఓ తెలిపారు. తర్వాత ఎస్టీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఇంగ్లిష్ సబ్జెక్టులో విద్యార్థులను పలు ప్రశ్నలు అడుగగా సమాధానం చెప్పారు. మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం అందుతుందా అని అడుగగా సరైన సమయంలో భోజనం, అల్పాహారం అందిస్తున్నారని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని మరమ్మతు చేసేంత వరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తరలించాలని ఆదేశించారు. తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏఓ ప్రశాంత్‌కుమార్, మండల నోడల్ అధికారి లింగారెడ్డి, ఐబీ ఏఈ ఎర్ర ప్రశాంత్, ప్రిన్సిపాల్ అపర్ణ, డీసీడీఓ సౌజన్య పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గీసుకొండ : ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మత్స్య పారిశ్రామిక సొసైటీని ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయాలని, అందులో ముదిరాజ్‌లకు 75 శాతం సబ్సిడీతో నిధులను రాష్ట్రం ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. మహాసభ మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, ఎన్‌ఆర్‌ఐ విభాగం రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, నీరటి సదానందం, చొప్పడి సోమయ్య, కంబాల కోటి, ఎంబాడి నర్సింహరాములు, రఘు, ఉపేందర్, ఉడుతబోయిన వేణు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

వర్ధన్నపేట : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ సురేష్ కుమార్, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సురేష్‌కుమార్ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, మొక్కలు నాటుట తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. సమావేశానికి ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ విజయసాగర్, ఎంపీఓ ధనలక్ష్మి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ రాజేందర్, డీటీ వినయేందర్ రెడ్డి, ఏపీఓ నాగేశ్వర్‌రావు, జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'బ్యాంకు మేనేజర్‌పై చర్య తీసుకోవాలి'


వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

సంగెం : రైతుల నుంచి బలవంతంగా వ్యక్తిగత ఇన్సూరెన్స్‌లు తీసుకుంటున్న గవిచర్ల గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా కమిటీ నాయకుడు ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన తహసీల్దార్‌కు వినతి ప్రతం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు రుణాలు రెన్యూవల్ చేసుకుంటున్నపుడు తెలియకుండానే వ్యక్తిగత ఇన్సూరెన్స్ కోసం డబ్బులు కట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీని ఎలాంటి పాత బకాయిగాని, మరే ఇతరాలకు కట్ చేసుకోకుండా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఖాతరు చేయడం లేదని విమర్శించారు. సంబంధిత అధికారులు స్పందించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న సదరు బ్యాంకు మేనేజర్‌పై చర్య తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గోనే రాంచందర్, మండల ఐలయ్య, రౌతు శ్రీనివాస్, రాగి రవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక


ఎంపికైన ఎన్‌సీసీ కేడెట్లతో ఉపాధ్యాయులు

నెక్కొండ : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎన్‌సీసీ దోహదపడుతుందని జెడ్పీఎస్ఎస్ హెడ్‌మాస్టర్ ఎం.రంగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలోని విద్యార్థుల్లో ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10వ తెలంగాణ బెటాలియన్ వరంగల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శారీరక, రాత పరీక్షలు నిర్వహించి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి 40, 8వ తరగతి నుంచి 18 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హవాల్దార్లు విజయ్, రఫిక్, పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ వినయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు పల్లె దవాఖాన కిటికీ అద్దాలు ధ్వంసం చేశారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కలాం ఫౌండేషన్ బాధ్యులు ఎండీ బాషామియా, పరికి మధుకర్ కోరారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామంలో ఆకతాయిలు ఎక్కువయ్యారని పోలీసులు నిఘా పెంచాలన్నారు. కార్యక్రమంలో ఊడుగుల రాజు, పోగుల అశోక్, గుళ్లపల్లి స్వామి, రాజు, రెడ్డబోయిన ఓదేలు ఉన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



ఖానాపురం: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ మండలంలోని ధర్మారావుపేటలో బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ అధ్యక్షుడు మేకల కుమారస్వామి మాట్లాడుతూ తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తోందన్నారు. నాయకులు సత్యం, కర్ణాకర్, సమ్మయ్య, అశోక్, నవీన్, చోట రవి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

నల్లబెల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా, ప్రతీ కార్యకర్త బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొద్దురెడ్డి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయం, నిరుద్యోగులు, గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేయడం హర్షణీయమన్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తడుక వినయ్, బచ్చు వెంకన్న, పెరుమాండ్ల కోటి, సుదగాని ప్రమోద్, కామెర పాపయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా పాఠశాల ప్రాంగణం

చెన్నారావుపేట : స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణం బురదమయంగా మారిందని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా వర్షపు నీరు, ఊటలతో గ్రౌండ్ మొత్తం బురదమయంగా ఉంటుందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి మొరం పోసి సమస్యలు పరిష్కరించాలన్నారు.

నిధులు కేటాయించాలి

చెన్నారావుపేట : అసెంబ్లీ సమావేశాల్లో గొల్ల కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీకి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గొర్రెల పంపిణీలో నగదు బదిలీ చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

మహా ధర్నాను జయప్రదం చేయాలి

శాయంపేట : ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఆగస్టు 9న జరిగే మాదిగల మహా ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రేణికుంట కొమురయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో మాదిగల మహా ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్రంలో అధికారం చేపట్టిన 100రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఊసెత్తడం లేదని మండిపడ్డారు. ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాల రిజర్వేషన్‌ను సమానంగా కేటాయించాలని కోరారు. రాష్ట్ర నాయకులు మస్కే సదయ్య, దైనంపల్లి రాజేశ్, చిలకల గోపి, శనిగరపు క్రాంతి, సమన్, అరుణ్, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు


నర్సంపేట: కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


నల్లబెల్లి: కేక్ కట్ చేస్తున్న బానోత్ సారంగపాణి

నర్సంపేట/నల్లబెల్లి/ఖానాపురం/గీసుకొండ/పర్వతగిరి/దుగ్గొండి /రాయపర్తి: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామరావు జన్మదిన వేడుకలను ఆయా మండల కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పార్టీ మండలాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ కేటీఆర్ సేవలను కొనియాడారు.


దుగ్గొండిలో..


రాయపర్తిలో..


ఖానాపురంలో..

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం


చెన్నారావుపేట: మాట్లాడుతున్న నర్సింగరావు


సంగెం: ప్రధాన మంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నారావుపేట : కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు సాధు నర్సింగరావు అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, బీహార్‌కు తప్ప తెలంగాణతో పాటు మిగిలిన రాష్ట్రాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం లేకపోవడం బాధాకరమన్నారు. ములుగులో గిరిజన యూనివర్సిటీ, బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ప్రస్తావన లేదన్నారు. నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలన్నారు. కడగండ్ల యాకయ్య, అశోద నర్సింగం, ఈద విజయేందర్, బక్కి కుమారస్వామి, కోడి కృపాకర్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ ధర్నా

గీసుకొండ : మండలంలోని కోనాయమాకుల వద్ద వరంగల్–నర్సంపేట రహదారిపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తెలంగాణకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపిన ఎన్డీఏ సర్కారు తీరును నిరసిస్తూ ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, రావుల శ్రీనివాస్‌రెడ్డి, చాడ కొమురారెడ్డి, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణకు మొండిచేయి చూపింది'

పర్వతగిరి : తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశపడ్డ ప్రజలకు మోదీ ప్రభుత్వం మొండిచేయి చూపిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ కేంద్రం ఎంతో కొంత రాష్ట్రానికి సముచిత స్థానం కల్పిస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని ఎదురు చూశారన్నారు. కుసుం రాంచందర్, భాస్కర్, బొట్ల మహేంద్ర, ఎండీ.సర్వర్, జూలపల్లి గంగాధర్‌రావు, చింతకుట్ల మల్లికార్జున్ పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి దిష్టిబొమ్మ దహనం

సంగెం : బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకుండా వివక్ష చూపిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడంపై నిరసనగా మండల కేంద్రంలో ప్రధాన మంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 8మంది ఎంపీలు, ఇద్దరు మంత్రులున్నా ఏం మాట్లాడడం లేదని, బడ్జెట్ కేటాయించేలా చూడాలని డిమాండ్ చేశారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, యూత్ అధ్యక్షుడు ఆగపాటి రాజు, నాయకులు నాగరాజు, రాజ్‌కుమార్, సంపత్‌రెడ్డి, మల్లయ్య, సాంబయ్య, జగన్నాథచారి, శ్రీకాంత్, వెంకటయ్య, భాస్కర్, సారంగం, శ్రీకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన బొమ్మెర బక్కయ్య బుధవారం మృతిచెందాడు. కాగా బక్కయ్య మృతదేహంపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానన్నారు. మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్‌గౌడ్, చిన్నాల రాజబాబు, బండి రాజబాబు, ఆకుల సమ్మయ్య, మాకినేని పెద్ద కృష్ణారావు, సంతోష్‌గౌడ్, బాషబోయిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. రాయపర్తి మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు జినుగు రత్నాకర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతుండగా పార్టీ నాయకులు ఆయనను పరామర్శించారు.